క్లుప్తంగా

విద్యార్థుల భవితకు స్కౌట్స్ అండ్ గైడ్స్



తోటగరువు హైస్కూల్‌లో టెంట్ వేసి కూర్చొన్న విద్యార్థులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. స్కౌట్ మాస్టార్ స్వామినాయుడు ఆధ్వర్యంలో స్కౌట్ విద్యార్థులతో కలిసి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు టెంట్లు వేయడం, జెండా కర్ర ఏర్పాటు చేసి ఆవిష్కరించడం, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని భవాని, స్కౌట్ మాస్టార్ స్వామినాయుడు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు పైచదువులు, ఉద్యోగాల సాధనలో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.చిన్నమ్మలు, టి.రామకృష్ణ, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విశాఖ వ్యాలీ స్కూల్‌లో సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ సతీమణి దివ్య

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో శుక్రవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ పర్యవేక్షణలో పాఠశాల సైన్స్ క్లబ్, ప్రేరణ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. ముఖ్య అతిథి కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ సతీమణి దివ్య కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రాజెక్టులను పరిశీలించారు. శాస్త్రీయత, సృజనాత్మకతతో కూడిన ఆకర్షణీయమైన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులను ఆమె అభినందించారు. సైన్స్ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి ఇలాంటి సైన్స్ ప్రాజెక్టులు బాటలు వేస్తాయన్నారు. విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మరో అతిథి బార్క్ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ ఇంద్రజిత్ పాత్రా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుప్పిలి పృథ్వీకి ఏయూ డాక్టరేట్



పృథ్వీకి డాక్టరేట్ ఉత్తర్వును అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థి కుప్పిలి పృథ్వీకి డాక్టరేట్ లభించింది. 'పీపీసీతో తయారు చేసిన కాంక్రీట్ బలం, మన్నికతో పాటు కంకర పునర్వినియోగం' అనే అంశంపై ఆచార్య డి.ఎస్.ఆర్.మూర్తి మార్గదర్శకత్వంలో జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు నుంచి పృథ్వీ డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా పృథ్వీని విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు.

రామ్‌నగర్ పార్క్‌లో మరింత పచ్చదనం



పార్క్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ లోని పార్క్‌లో మరింత పచ్చదనం ఉండేలా కార్పొరేషన్ సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం పార్క్‌లో కూలీ చేత వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పర్యవేక్షణలో మొక్కలు నాటారు. ఈ చర్యతో పచ్చదనంతో పార్కు కళకళలాడనుంది.

గెడ్డలో చెత్త తొలగింపు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరులోని గెడ్డలో పేరుకుపోయిన చెత్తను శుక్రవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్‌కు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పారిశుధ్య సిబ్బంది గెడ్డను శుభ్రం చేశారు. దీంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అస్తవ్యస్తంగా మ్యాన్‌హోళ్లు



ఇసుకతోట-కృష్ణా కళాశాల రోడ్డులో మ్యాన్‌హోల్ దుస్థితి



మద్దిలపాలెం రోడ్డులో పూడ్చకుండా వదిలేసిన మ్యాన్‌హోల్



సీఎంఆర్ శ్మశానవాటిక దరి రోడ్డులో గోతులమయంగా మ్యాన్‌హోల్



మద్దిలపాలెం శివాలయం రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

- గోతుల్లా తయారైన యూజీడీలు
- రోడ్డెక్కి ప్రవహిస్తున్న మురుగు నీరు
- రాకపోకలకు వాహన చోదకుల ఇక్కట్లు
- సమస్య పట్టించుకోని విభాగాధికారులు

మద్దిలపాలెం: జీవీఎంసీ భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అరకొరా పనులు సైతం స్థానికులకు తంటాలు తెచ్చిపెడుతున్నాయి. పలు వార్డుల్లో రహదారులు, భూగర్భ మురుగు నీటి పారుదల యూజీడీ పనులు చేపట్టారు. ముందస్తు ప్రణాళిక, భవిష్యత్తులో రాబోయే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు చేయకపోవడంతో ప్రజలు అవస్థలు తంటాలు పడుతున్నారు.

ప్రమాదాల బారిన ప్రయాణికులు

జీవీఎంసీ 23వ వార్డులోని పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా నిర్మించిన యూజీడీ మ్యాన్‌హోళ్లు గోతులను తలపిస్తున్నాయి. కృష్ణా కళాశాల రోడ్డు నుంచి మద్దిలపాలెం శివాలయం వైపు వెళ్లే రహదారిలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రోడ్డు మధ్యలో గల మ్యాన్‌హోళ్లు పెద్ద గోతుల్లా ఉన్నాయి. ఈ రోడ్డుపై ఎక్కడికక్కడ ఇదే మాదిరిగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి మరమ్మతులకు చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.



మద్దిలపాలెం వద్ద రోడ్డుకు ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్

యూజీడీ ఇంజినీర్ల నిర్లక్ష్యం

జీవీఎంసీ యూజీడీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మ్యాన్‌హోళ్లు ఇలా తయారయ్యాయని స్థానికులు, వాహన చోదకులు మండిపడుతున్నారు. రోడ్డుకు సమాంతరంగా మ్యాన్‌హోళ్లను నిర్మించకుండా.. ఒక్కో చోట ఎత్తుగాను, మరి కొన్నిచోట్ల గోతుల్లా లోతుగాను నిర్మించారని విమర్శిస్తున్నారు. దీంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

మురుగు లీకేజీలు పట్టవా..?

మద్దిలపాలెం శివాలయం రోడ్డులోని మ్యాన్‌హోల్ నిత్యం లీకవుతూనే ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఆ మార్గమంతా దుర్వాసన భరితంగా మారుతోంది. శివాలయం నుంచి సీఎంఆర్ దరి శ్మశానవాటిక వైపు గల రోడ్డులో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రతి మ్యాన్‌హోల్ చుట్టూ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్ అడుగు లోతులో భూమిలోకి కూరుకుపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఒక్కో కాలనీలో పదుల సంఖ్యలో గోతుల మ్యాన్‌హోళ్లు దర్శనమిస్తున్నాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండటంతో రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ కొన్నిచోట్ల వీధిలైట్లు సరిగ్గా వెలగక గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే నా ప్రయాణం

13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని సీతమ్మధారలోని ఆయన నివాసంలో శుక్రవారం 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె విజయసాయిరెడ్డితో మాట్లాడుతూ తాను టీడీపీలో చేరినట్లు తప్పుడు ప్రచారం జరిగిందని, అందులో నిజం లేదన్నారు. ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి భవిష్యత్‌లో మంచి ప్రాధాన్యం ఉంటుందని చెప్పినట్లు కార్పొరేటర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, వార్డు నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలపై ఇంటింటా ప్రచారం



బీఎస్ఆర్ నగర్‌లో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్న తీరుపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్‌లో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నిత్యావసర వస్తువులపై ఇటీవల పెరిగిన ధరలు, విద్యుత్ ట్రు అప్ చార్జీలు, ప్రభుత్వ రంగా లు ఏవిధంగా ప్రైవేటీకరణ జరుగుతుంది తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిత్యావసర సరకులు అన్నింటిపైనా విపరీతంగా ధరలు పెంచి ప్రజలపై మోయ లేని భారం మోపుతోందన్నారు. ట్రు అప్ చార్జీలు పెంచి ఇబ్బంది పెడుతోందని చెప్పారు. కేంద్రంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధమైందన్నారు. ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ రంగాలకు కట్టబెడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వివరిస్తూ వారం పాటు ఇంటింటి ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, నాగరాజు, రమణ, సన్యాసమ్మ, లక్ష్మి, నరేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. బెంగాలీ నాటకం 'కృష్ణ'



కృష్ణ నాటకంలోని ఓ సన్నివేశం



బెంగాలీ గీతాన్ని ఆలపిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సతీమణి

మద్దిలపాలెం: పురుషాధిక్య దోపిడీకి గురవుతూ సతమతమవుతున్న నేటి భారత మహిళా గాథలే కథగా కృష్ణ పేరిట బెంగాలీ నాటకాన్ని అద్వితీయంగా ప్రదర్శించి అందరి హృదయాలను దోచుకున్నారు. రసజ్ఞ వ్యవస్థాపకుడు డాక్టర్ వేమలి త్రినాథరావు నేతృత్వంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రసజ్ఞ జాతీయ నాటక ప్రదర్శనల్లో భాగంగా మూడో రోజు దేబాషిస్ దత్తా దర్శకత్వంలో బెంగాలీ భాషలో కృష్ణ అనే నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథులు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభించారు. వారిని కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ సతీమణి బెంగాలీలో ఓ గీతాన్ని ఆలపించి ఆకట్టుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశ భాషల్లో నాలుగో స్థానంలో ఉన్న బెంగాలీలో ఏపీలోని విశాఖ వేదికగా గొప్ప నాటకాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు భాష కంటే నాటకంలోని భావాన్ని కళాప్రియులకు అందించాలనే కాంక్షతో చేసిన ప్రయత్నం హర్షణీయమన్నారు. అనంతరం కృష్ణ(మహాభారతంలో ద్రౌపదికి మరో పేరు) నాటకం ప్రదర్శన ప్రారంభమైంది. ప్రతి సన్నివేశాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి అందరినీ మెప్పించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



పూజలందుకున్న గౌరీపరమేశ్వరులు



గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజిపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గవర సామాజిక వర్గ ప్రజల ఇలవేల్పుగా, కోరిన వరాలిచ్చే చల్లనితల్లిగా, భక్తుల పాలిట కొంగుబంగారమైన గౌరమ్మ సంబరాలను సంఘ సభ్యులు, మహిళలు, యువకులు దశాబ్ద కాలానికి పైగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పాత వెంకోజీపాలెంలోని సీతారామాలయంలో 9 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజు సాయంత్రం సీతారామాలయంలో మహిళలంతా ప్రత్యేక పూజలు చేశారు. చెరుకు గడలు, అమ్మవారి పీఠం వంటివి మోసుకుంటూ ఊరేగింపుగా కొత్త వెంకోజిపాలెం భూలోకమాత ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాన్ని తలపై మోస్తూ ఊరేగింపుగా సీతారామాలయానికి తీసుకొచ్చి ప్రతిష్టించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఆదారి పరదేశినాయుడు మాట్లాడుతూ 9 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రతి రోజు రాత్రి 8 నుంచి 11 గంటల వరకు వినోద కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ కార్యవర్గం పీల వెంకట పరదేశినాయుడు, శ్రీను, యల్లపు నాగరాజు, ఆదారి శివప్రకాష్, పాలమరశెట్టి త్రినాథ్, కె.రఘు, మళ్ల శ్రీను, రాజగిరి సురేష్, మళ్ల కనకరాజు, మళ్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను క్రీడాకారులు వినియోగించుకోవాలి

విశాఖ స్పోర్ట్స్: క్రీడాకారులు ప్రతిభతో రాణించి ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులకు పెంచిన మూడు శాతం కోటాను సద్వినియోగపరుచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. ఏయూ టెన్నిస్ జట్టు ఎంపికలో భాగంగా శుక్రవారం నిర్వహించిన పోటీలకు ఆయన హాజరై ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. సౌత్ జోన్ అంతర వర్సిటీల టెన్నిస్ పోటీలు కేరళలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరగనుండగా.. ఎంపిక చేసిన జట్టు పోటీ పడనుంది. కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, పీడీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో కాళీపట్నం రామారావు శత జయంత్యుత్సవం

విశాఖ సిటీ: కళాప్రపూర్ణ కాళీపట్నం రామారావు శత జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు శాఖ ఆచార్యుడు వెలమల సిమ్మన్న రాసిన గ్రంథాన్ని ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో అగ్రశ్రేణి కథకుల్లో కాళీపట్నం రామారావు ఒకరన్నారు. తన కథల్లో సామాజిక వాస్తవికతను చిత్రీకరించి జాతీయ పురస్కారాలు సైతం అందుకున్నారని గుర్తు చేశారు. ప్రొఫెసర్ జర్రా అప్పారావు మాట్లాడుతూ తెలుగు శాఖలో కాళీపట్నం రామారావు నూరేళ్ల పండగ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఒక ఆదర్శమూర్తి, సమతామూర్తిగా అభివర్ణించారు. గ్రంథ కర్త ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ యజ్ఞం, ఆర్తీ చావు, తదితర కథల్లో దళిత జీవితాన్ని చిత్రీకరించారని చెప్పారు. కార్యక్రమంలో కాళీపట్నం సుబ్బారావు, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డా.రత్నశేఖర్, డా.వెంకటేశ్వర్లు, డా.సీతారత్నం, డా.గిరీష్‌కుమార్, డా.ఎం.దాసు, డా.ఎం.ప్రతాప్, డా.సూర్యనారాయణ, డా.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జన శిక్షణ సంస్థాన్‌లో వృత్తి విద్యా శిక్షణలు



మాట్లాడుతున్నసత్యదేవ్

మద్దిలపాలెం: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా మత్స్యకారులకు వలల తయారీ, సెలూన్ సర్వీసెస్‌లో శిక్షణ కార్యక్రమాలను గురువారం పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో ప్రారంభించామని వరల్డ్ టీచర్ ట్రస్ట్ సంచాలకుడు డాక్టర్ సత్యదేవ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అనేక రకాల వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలను సుమారు 38 ఏళ్లుగా నిర్వహిస్తూ లక్షల మందికి లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. మత్స్యకార వలల తయారీ, సెలూన్ సర్వీసెస్ కార్యక్రమాలు ప్రారంభించడం ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేయనున్నామని చెప్పారు. జన శిక్షణా సంస్థాన్ చైర్మన్ సి.ఎ.రామరాజు మాట్లాడుతూ జేఎస్ఎస్ ద్వారా ఎంతో మందికి అనేక రకాల వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే సర్టిఫికెట్‌కు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు చాలా ప్రాధాన్యముందని తెలిపారు. కార్యక్రమంలో జన శిక్షణా సంస్థాన్ సిబ్బంది, శిక్షణకు హాజరైన అభ్యర్థులు పాల్గొన్నారు.

శ్రీవారి పుష్పయాగానికి పూల తరలింపు



పుష్పయాగ సంకల్పం చేస్తున్న దీపోత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు

ఎంవీపీకాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పుష్పయాగ సంకల్పం నిర్వహించారు. ఈ నెల 9న తిరుమలలో శ్రీవారి పుష్పయాగం జరగనున్న నేపథ్యంలో విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన పూలకు శుక్రవారం సంకల్పం చేశారు. ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి, నగర భక్తుల నుంచి ఈ పుష్పాలు సేకరించామని కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ తెలిపారు. ఇందులో కలువలు, తామరలతోపాటు పలు రకాల పుష్పాలు ఉన్నాయన్నారు. పనంగిపల్లి రంగమధాచార్యులు ఆధ్వర్యంలో పుష్పయాగ సంకల్పం జరిగిందన్నారు. అనంతరం సంకల్పం చేసిన పూలను శ్రీవారి పుష్పయాగానికి తిరుమల తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి గ్రంధి రాజేష్, పలువురు మహిళ భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకలు ప్రారంభిస్తున్న విజయరవీంద్ర

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, కేరింతల నడుమ ఆద్యంతం ఆహ్లాదభరితంగా జరిగాయి. వేడుకలను కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర ప్రారంభించి మాట్లాడారు. జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య పరిచయానికి ఫ్రెషర్స్ డే వేదికగా నిలుస్తుందన్నారు. సీనియర్ల మార్గదర్శకత్వంలో ఆచార్యులు సూచనలకు అనుగుణంగా కొత్త విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఎప్పుడూ స్నేహపూర్వక వాతావరణం ఉండాలని సూచించారు. విద్యార్థులు ఆటపాటలు, పాశ్చాత్య, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు

ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలకు చెందిన రుషికొండ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి మాఫిల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో జి.ఎస్.శివకుమార్ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో కెరీర్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. పలువురు కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా కైలాసగిరి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ జేసీ రమేష్

విశాఖ సిటీ: విశాఖకే తలమానికమైన కైలాసగిరిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అందరూ సహకరించాలని వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కొమ్మి రమేష్ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో కైలాసగిరిపై ఉన్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసగిరిని సుందరంగా, శుభ్రంగా ఉంచేందుకు, పచ్చదనం పెంపొందించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. వ్యాపారులు తమ వ్యక్తిగత వాహనాలను పార్కింగ్ ప్రాంతంలో మాత్రమే నిలపాలని సూచించారు. తద్వారా సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తమకు కేటాయించిన పరిధిలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని, అద్దె బకాయిలను ప్రతి నెలా 5లోగా చెల్లించాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో శివాని, ఈఈ ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, డీఈఈలు మోహనరావు, శంకరరావు, పరిపాలన అధికారి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో ఛట్ పూజ సందడి



సాగర తీరంలో ఛట్ పూజలో పాల్గొన్న ఉత్తరాది ప్రజలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో గురువారం సాయంత్రం ప్రారంభమైన ఛట్ పూజా కార్యక్రమాలు శుక్రవారం ఉదయం కూడా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచి ఉత్తరాది ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాండురంగాపురం డౌన్‌లోని బీచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో పూజా సామగ్రితో ప్రత్యక్ష నారాయణుడు సూర్య భగవానుడిని పూజించారు. ఈ పూజలు చేస్తే ఆయురారోగ్యాలు, అనంద ఐశ్వర్యాలతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఉత్తర భారతదేశ భక్తుల నమ్మకం. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యభగవానుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. నగరంలో నివసిస్తున్న ఉత్తరాది ప్రజలంతా పెద్ద సంఖ్యలో బీచ్‌లో పూజలు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది.